# మినీకథ

## జన్మభేదాలు

సురాశర్మ

మా ఆఫీసు బయటి ఆవరణలోని చల్లని వేపచెట్టుకింద నిల్చొని ఓ సిగరెట్ తగలేస్తున్న నావైపు ఓ మేక దీనంగా చూస్తూంది. దాని భావమేమిటో నాకు అర్థం కాలేదు ఒంటిగంటకు భోజనానికెళ్ళి తిరిగొచ్చేసరికి ఆ మేక అక్కడే వుంది. కానీ అది ఒంటరిగా లేదు. దాని పక్కన రెండు అప్పుడే పుట్టిన బుజ్జిమేకపిల్లలున్నాయి. అది ప్రేమగా వాటి ఒళ్ళు నాకుతోంది. అవి అప్పుడే పొదుగును వెదుక్కొని పాలకెగబడుతున్నాయి. చేకలించి గంతులేస్తున్నాయి. విచిత్రం! కొద్ది నిమిషాలక్రితం ఈ భూమిమీదికొచ్చిపడిన వీటికి అప్పుడే తల్లిపాల జిజ్ఞాస-చెంగు చెంగున ఎగిరే చైతన్యం! మానవ సంతతిలో ఈ చైతన్యత లేదే! వాటిని చూస్తే మా ఆవిడ గుర్తొచ్చింది. ఆమెకు తొమ్మిది నెలలు నిండాయి.

మా ఆవిడ రెండేళ్ళకోసారి ప్రసవిస్తున్నా మాకు ముగ్గురూ ఆడపిల్లలే పుట్టారు. ఈసారైనా మొగపిల్లాడు పుడతాడనే ఆశతో పుట్టింటికెళ్లాలంది కాన్పుకు. ఆఫీసుకు సెలవు పెట్టి వాళ్ళ పుట్టిల్లు అందవరం బయల్దేరాను మా ఆవిడను తీసుకొని.

మా అత్తవారింట్లో మాకు స్వాగతం పలుకుతున్నా మామూలు ఆహ్వానం పలికారు. మా మావయ్య మామూలు నవ్వు నవ్వాడు. ఆయనకు ఐదుగురు ఆడపిల్లలు. చివర్న ఓ అబ్బాయి పుట్టాడు. అబ్బాయిప్పుడు ఇంటర్ చదువుతున్నాడు. మా మావయ్య కుటుంబమంతా ఆ అబ్బాయి మీద ఆశపెట్టుకొని వున్నారు.

అందవరంలో ఆరు రోజులున్నాను. మా ఆవిడకు కొద్దిపాటి నొప్పులొస్తున్నాయి. పోతున్నాయి. ఊళ్ళో పొద్దుపోవడం కష్టంగా వుంది నాకు. ఆ రోజు మధ్యాహ్నం ఇంటినుంచి బయల్దేరి వూరు దాటి నది దాటి అలా కొండ శిఖరాల వైపు వెళ్ళాను. దారిలో సన్నటి బాట వెంట నడిచి వెళ్ళాలి. చుట్టూతా దట్టమైన కంపచెట్లు. దారంట ఎవ్వరూ లేరు. కాస్తంత దూరాన ఓ కంపచెట్టు కింద ఎవరో కూర్చొని వుండటం చూసి క్రమంగా దగ్గరికెళ్ళాను. ఓ అందమైన తెల్లటి సుగాలీ ఆవిడ గొంతుకూర్చొని బాధతో మూలుగుతోంది. దగ్గరికెళ్ళి సానుభూతిగా ఏమని ప్రశ్నించాను. ఆవిడ నావైపు అదోవిధమైన చూపు చూసి— "ఏం లేదు పో! నువ్వెళ్ళి పో" అరచేత్తో గాలిని తోస్తూ విసురుగా అంది. నేను ముందుకు వెళ్ళిపోయాను. ఓ గుట్ట అంచును చేరి కూర్చున్నాను. అక్కడి వాతావరణం ఎంతో అహ్లాదకరంగా వుంది — ఎంతసేపు అట్లా కూర్చుండిపోయానో నాకే తెలీదు. సూర్యుడు పెద్ద అగ్నిగోళంలా అస్తమించిపోతున్నాడు. చీకటిపడేలోగా వూళ్ళోకి చేరుకోవాలి. లేకుంటే ఎలుగుబంట్లు ప్రత్యక్షమవుతాయక్కడ. అందుకని లేవడమే తడవు వడివడిగా బయలుదేరి అఘమేఘాల మీద కొండ దిగేశాను.

ఏరు దాటుకొని అవలిగట్టు చేరానో లేదో మళ్ళీ ఆ సుగాలీ సుందరి కనిపించింది. ఆవిడిప్పుడు ఒంటరిగా లేదు. నేను కొండెక్కి దిగేలోగా ఎప్పుడు శిశువును ప్రసవించిందో ఏమో ఏటి నీళ్ళలో పిల్లాడ్ని కడిగి తన పొడి పైటతో వొత్తి వాడ్ని భుజానేసుకుని ఏటి నీళ్ళలో దిగి వడివడిగా వెళ్ళిపోతోంది. నిజమే. చీకటిపడేలోగా ఎలుగుబంట్ల బారిపడకుండా ఆ కొండ ఎక్కిదిగి వాళ్ళ సుగాలీ తండా చేరుకోవాలావిడ.

నేను క్రమంగా ఊళ్ళోకొచ్చి మా యిల్లు చేరుకునే సరికి యింట్లో చాలా హడావిడిగా వుంది. అప్పటికే మా ఆవిడకు నొప్పులు ప్రారంభమయ్యాయట. ఆయాసపడుతోంది. తెలివి తప్పుతోంది. వూళ్ళోని నాటు మంత్రసాని వచ్చి- ఈ కేసు నావల్ల కాదు. టౌనుకి తీసుకెళ్ళాల్సిందేనని తేల్చేసిందిట. సమయానికి లేకుండా ఎక్కడికెళ్ళావంటూ మా మావయ్యా అత్తయ్యా నావైపు నిరసనగా చూశారు. టౌనులోకి బస్సులు లేవు. రెండెడ్ల బండిని కట్టి మా ఆవిడను అందులో కెక్కించేశారు.

నర్సింగ్‌హోమ్ చేరేసరికి పూర్తి స్పృహకోల్పోయి తలకాయ వేలాడేసింది. డాక్టర్లు, నర్సులు హడావిడిగా చేతుల మీద ఆవిడ్ని లోనికి మోసుకెళ్ళారు. చావు బతుకుల మధ్య రెండు రోజుల పోరాటం తర్వాత సిజేరియన్ ఆపరేషన్ చేసి శిశువును బైటికి తీశారు. పిల్లా తల్లీ ఏదో ఫర్వాలేదు అన్నారు.



నా బాధల్లా నాకిప్పుడు ఏ శిశువు పుట్టిందని కాదు. ఆ రోజు మా ఆఫీసు ఆవరణలో మేక-రెండురోజుల క్రితం ఆ సుగాలీ ఆవిడ అంతసులభ ప్రసవాలు చేసుకోగల్గినప్పుడు మా ఆవిడకునైతం అలా ఎందుకు కాలేదు. ఈ ప్రకృతిలో ఇంతటి జన్మభేదాలెందుకూ అని ?